ఇడి నోటీసు తూచ్..!

- సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు
- రాజకీయ కక్షతోనే నోటీసులు
  : ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇడి నోటీసులు రాజకీయ ప్రేరేపితమని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఇడి నోటీసులపై ఆమె గురువారం నిజామాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. తనకు వచ్చింది ఇడి నోటీసు కాదు..మోడీ నోటీసని చెప్పారు. రాజకీయ కక్షతో పంపించిన నోటీసు కాబట్టి దానిపై పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదని కవిత అన్నారు. ఇడి నోటీసును తమ పార్టీ న్యాయ విభాగానికి ఇచ్చామని, ఆ విభాగం ఎలా చెబితే అలా ముందుకెళ్తామని తెలిపారు. తెలంగాణలో రాబోయే ఎన్నికల వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని తనకు నోటీసులు ఇచ్చారని ఆమె తెలిపారు. గత ఏడాది కాలం నుంచి ఆ కేసులో దర్యాప్తు జరుగుతోందని, ఇంకెన్నాళ్లు ఆ విచారణ ఉంటుందో తనకు తెలియదన్నారు. 2జి కేసులోనూ ఇంత కాలం విచారణ జరగలేదని తెలిపారు. రాజకీయ ఉద్దేశంతోనే కేసు సాగుతోందని, తెలంగాణ ప్రజలు దీన్ని సీరియస్‌గా తీసుకోరన్నారు. తాము ఏ పార్టీతోనూ కలవలేదని, కేవలం తెలంగాణ ప్రజలు, భారత దేశ ప్రజలతో మమేకం అయ్యామన్నారు. దేశ ప్రజలు సిఎం కెసిఆర్‌ను కావాలనుకుంటున్నారని, దీంతో ఆ రెండు పార్టీలకు ఆ భయం పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. మేం ఎవరికీ బి టీమ్ కాదని స్పష్టంచేశారు. అంతులేని టివి సీరియల్ తరహాలో ఇడి విచారణ సాగుతున్నదని, అదేమీ పెద్ద విషయం కాదన్నారు. బిజెపి ఎన్నికల స్టంట్‌లో భాగంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు ఇడి మరోసారి నోటీసు

ఢిల్లీ లిక్కర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఇడి గురువారం మరోసారి నోటీసు జారీ చేసింది. ఢిల్లీలోని ఇడి కార్యాలయంలో శుక్రవారం హాజరు కావాలని ఆదేశించింది. కవితకు సమన్లు జారీ చేయడంతో ఇంతకాలం సైలెంట్‌గా ఉన్న ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మరోసారి కదలిక వచ్చినట్టైంది. గత మార్చిలో మూడు సార్లు ఇడి ముందు కవిత హాజరయ్యారు. ఆ తరువాత కేసులో కదలికలేదు. ఇటీవల అరుణ్ రామచంద్రన్ పిళ్లై అప్రూవర్‌గా మారిన విషయం తెలిసిందే. పిళ్లై దగ్గర నుంచి ఇడి అధికారులు కీలక సమాచారం రాబట్టినట్టు తెలుస్తోంది. కవిత బినామీగా అరుణ్ రామచంద్రన్ పిళ్లైపై దర్యాప్తు సంస్థ అభియోగాలు మోపింది. ఇప్పటికే ఈ కేసులో పలువురు సౌత్ గ్రూపులోని సభ్యులు అప్రూవర్‌గా మారారు. అప్రూవర్‌గా మారిన అరుణ్ రామచంద్రన్ పిళ్లై, మాగుంట శ్రీనివాసరెడ్డి , ఆయన కుమారుడు రాఘవరెడ్డి శరత్ చంద్రారెడ్డి ఇచ్చిన సమాచారం ఆధారంగా లిక్కర్ కేసులో కొత్త అంశాలు తెరపైకి వచ్చే అవకాశం ఉంది.

లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు

- సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు భరించలేక సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొల్లూరు గ్రామానికి చెందిన వంశీకృష్ణ(23) సింగరేణిలో ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులతో కలిసి పెద్దపల్లిలో నివాసం ఉంటున్నారు. ఆర్థిక అవసరాల నేపథ్యంలో ఆన్‌లైన్ యాప్ ద్వారా రుణం తీసుకొని ఇప్పటికే రూ.రెండున్నర లక్షలు చెల్లించారు. అయినా లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు తీవ్రమయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన వంశీకృష్ణ గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. లోన్‌యాప్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పెద్దపల్లి పోలీసులు తెలిపారు.

కొండాపూర్‌లో కిక్స్ స్మార్ట్ బైక్ స్టేషన్

- ఏర్పాటు చేసిన జిఎస్ కాల్‌టెక్స్

ప్రజాశక్తి-హైదరాబాద్

ఆటోమోటివ్ లూబ్రికెంట్ల విక్రయదారు జిఎస్ కాల్‌టెక్స్ ఇండియా హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో కిక్స్ స్మార్ట్ బైక్ స్టేషనును ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ సందర్భంగా ఆ సంస్థ సిఇఒ రాజేష్ నగర్ మాట్లాడుతూ.. నగరంలోని వివిధ ప్రదేశాలలో సర్వీస్ సెంటర్లు, కిక్స్ స్మార్ట్ బైక్ స్టేషన్లను ప్రారంభించడం గర్వంగా ఉందన్నారు. దశాబ్దాల అనుభవంతో వివిధ ఆటోమోటివ్, ఇండస్ట్రియల్ అప్లికేషన్ల కోసం అగ్రశ్రేణి లూబ్రికెంట్లను స్థిరంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నగరంలో తొలి దశలో 25 ప్రత్యేక సర్వీస్ స్టేషన్లను ప్రారంభించాలని యోచిస్తోన్నామన్నారు.. రెండో దశలో అదనంగా 50 స్టోర్‌లను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

'అంగన్వాడీ'ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

- సమ్మెకు వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో న్యాయముందని వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య, ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న పేర్కొన్నారు. తమను పర్మినెంట్ చేయాలని, పెన్షన్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్డ్‌బెనిఫిట్స్, వేతనంలో సగం పెన్షన్, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లింపు, తదితర డిమాండ్లను నెరవేర్చాలంటూ నిరసన చేస్తున్న అంగన్వాడీ కార్మికుల కోర్కెలను నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మెకు తమ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. మార్కెట్ యార్డుల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులందరూ అంగన్వాడీల పోరాటానికి సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీలను భయభ్రాంతులకు గురిచేసి సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర చేయడాన్ని ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బేషజాలకు పోకుండా సమ్మె చేస్తున్న యూనియన్లతో చర్చలు జరిపాలని సూచించారు. సమ్మెకు ఉద్యోగులు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

మహిళా రిజర్వేషన్‌పై కాంగ్రెస్ వైఖరేంటి?

- మేడే రాజీవ్ సాగర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళా రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌పార్టీ వైఖరి ఎంటో తెలుపాలని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ తర్వాతనే తెలంగాణలో సోనియా, రాహుల్‌గాంధీలు అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ ఇచ్చే దొంగ డిక్లరేషన్లు కాదని మహిళ రిజర్వేషన్‌పై క్లారిటీ కావాలని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకు రావడం లేదని ప్రశ్నించారు.

19 నుంచి ఎడ్‌సెట్, పిఇసెట్ కౌన్సెలింగ్

- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్, డిపిఇడి, బిపిఇడి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పిఇసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 19 నుంచి ప్రారంభం కానుంది. అదే రోజు నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. గురువారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ ఎస్‌కే మహమూద్, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, ఎడ్‌సెట్, పిఇసెట్ ప్రవేశాల కన్వీనర్ ప్రొఫెసర్ పి రమేశ్‌బాబు, ఎడ్‌సెట్ కన్వీనర్ ఎ రామకృష్ణ, పిఇసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వాటి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 19న ఎడ్‌సెట్, పిఇసెట్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని తెలిపారు. ఎడ్‌సెట్ ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, పరిశీలన, ఫీజు చెల్లింపునకు సంబంధించిన వివరాలను ఈ నెల 20 నుంచి 30 నమోదు చేయాలని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు స్కాన్ చేసిన వాటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. ఎన్‌సిసి, సిఎపి, వికలాంగులు, క్రీడల అభ్యర్థులకు సంబంధించి భౌతికంగా ధ్రువపత్రాల పరిశీలన 25 నుంచి 29 వరకు నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేనెల మూడు నుంచి ఐదు వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని పేర్కొన్నారు. ఆరున వెబ్ ఆప్షన్ల సవరణకు అవకాశముందని వివరించారు. తొమ్మిదిన మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. వచ్చేనెల పది నుంచి 13 వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. 30న తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. పిఇసెట్ ప్రవేశాలకు సంబంధించి 20 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, పరిశీలన, ఫీజు చెల్లింపు ఉంటుందని తెలిపారు. 24, 25 తేదీల్లో ఎన్‌సిసి, సిఎపి, వికలాంగులు, క్రీడల అభ్యర్థులకు భౌతికంగా ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. 28, 29 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. 30న ఆప్షన్ల సవరణకు అవకాశముందని తెలిపారు. వచ్చే నెల మూడున మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

నేడు బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం

- పార్లమెంట్‌లో వ్యవహరించాల్సిన వ్యూహంపై ఎంపిలకు కెసిఆర్ దిశానిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం శుక్రవారం ప్రగతిభవన్‌లో జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటలకు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కె చంద్రశేఖర్ రావు అధ్యక్షతన జరిగే సమావేశానికి బిఆర్ఎస్ లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులు హాజరుకానున్నారు. ఈనెల 18వ తేదీ నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఆయా అంశాలపై పార్టీ వైఖరి, అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపిలకు కెసిఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఇండియా పేరు భారత్‌గా మార్పు, జమిలి ఎన్నికలు, మహిళా బిల్లు, తదితర కీలక బిల్లులు పార్లమెంట్ ముందుకు వస్తున్నాయన్న వార్తల నేపథ్యంలో వాటిపై బిఆర్ఎస్ వైఖరిని కెసిఆర్ స్పష్టంచేయనున్నారు. రాష్ట్రానికి సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎంపిలకు వివరించనున్నారు. ఏ అంశంపై ఎవరు మాట్లాడాలి.., ఇతర పార్టీలతో సమన్వయం, లాబీయింగ్‌పై కెసిఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఎన్నికలకు ముందు జరుగుతున్న ప్రత్యేక సమావేశాలు కావడంతో బిఆర్ఎస్ కేంద్రంతో ఆచితూచి వ్యవహరించనుంది.

హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా అరెస్ట్

- నిందితుల్లో ముగ్గురు నైజీరియన్లు, వినియోగదారులు, సినీ నిర్మాత
- బేబీ సినిమాపై నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ సీరియస్
- ఇక నుంచి ప్రతీ సినిమాపై నిఘా

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపి సివి ఆనంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న.. కొనుగోలు చేసిన ఎనిమిది మందిని గురువారం నార్కోటిక్ విభాగం పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు నైజీరియన్లు, మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్న ఐదుగురు, ఓ సినీ నిర్మాత ఉన్నారు. వీరి నుంచి 50 గ్రాముల ఎండిఎంఎ, ఎనిమిది గ్రాముల కొకైన్, 24 ఎక్టసీ పీల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విలేకరుల సమావేశంలో హైదరాబాద్ సిపి సివి ఆనంద్ వివరాలు వెల్లడించారు.

గత నెల 11న నార్కోటిక్ విభాగం పోలీసులు గుడిమల్కాపూర్, మాదాపూర్లో దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ కేసులో బాలాజీ, సినీ ఫైనాన్షియర్ వెంకట రత్నారెడ్డి, మురళిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితులిచ్చిన సమాచారంతో హైదరాబాద్ నార్కోటిక్ విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. నైజీరియాకు చెందిన అమోబి చుక్వుడి మూనాగోలు, ఇగ్గ్వావ్ మిచెల్, థామస్ అనఘాకాలు బిజినెస్ వీసా, మెడికల్ వీసాపై ఇండియాకు వచ్చారు. 2015లో ఒకరు, 2020 మరొకరు, 2022లో ఇంకొక్కరు ఇండియా వచ్చి ఢిల్లీ, బెంగళూరులో మకాం వేశారు. సులువుగా డబ్బులు సంపాదించాలని నైజీరియా దేశానికి చెందిన వారి నుంచి డ్రగ్స్ కొనుగోలు చేస్తూ మన దేశవ్యాప్తంగా వారి కమ్యూనిటీ మెంబర్స్‌కు, విద్యార్థులకు (నైజీరియన్లకు) ఆన్‌లైన్‌లో డ్రగ్స్ విక్రయించడం మొదలుపెట్టారు. హైదరాబాద్‌పై దృష్టి సారించిన నిందితులు నగరంలోని యువకులను, విద్యార్థులను ఎంచుకుని డ్రగ్స్ కొకైన్, ఎండిఎంఎ తదితర డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో నగరానికి చెందిన దేవరకొండ సురేష్‌రావు, కొల్లి రాంచంద్, కూరపాటి సందీప్, పగళ్ల శ్రీకర్ కృష్ణ ప్రణీత్‌తోపాటు (డైరెక్టర్) అనుగు సుశాంత్ రెడ్డికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. దీన్ని గుర్తించిన పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో వెస్ట్‌జోన్ ఎస్‌పి డి సునితారెడ్డి, డిఎస్‌పి నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్ పి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బేబీ సినిమాపై సీరియస్

ఇటీవల విడుదలైన బేబీ సినిమాపై నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సీరియస్ అయ్యారు. డ్రగ్స్ కల్చర్ ప్రోత్సహించేలా సన్నివేశాలతో సినిమా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ సినిమాను చూసిన నిందితులు అలా పార్టీ చేసుకున్నారని చెప్పారు. సినిమాల్లో అలాంటి సన్నివేశాలను చిత్రీకరించినప్పుడు 'హెచ్చరిక కింద వేసే ప్రకటన' కూడా వెయ్యకుండా డైరెక్ట్‌గా ప్లే చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బేబీ సినిమా టీంకు నోటీసులు జారీ చేస్తామన్నారు. ఇక నుంచి ప్రతి సినిమాపై నిఘా వేస్తామన్నారు. అభ్యంతరకర సన్నివేశాలు ఉంటే ఊరుకునేది లేదని సిపి హెచ్చరించారు.

ఒకరు రమ్మంటున్నరు... ఇంకొకరు వద్దంటున్నరు

- మొన్న కృష్ణయాదవ్.. నేడు చికోటి ప్రవీణ్
- చేరికలపై బిజెపి వింత పోకడ
- నేతల మధ్య ఆధిపత్య పోరే కారణం?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చింత చచ్చినా పులుపు చావదన్నట్టుగా.. బిజెపి గ్రాఫ్ పడిపోతున్నా ఆధిపత్య పోరు మాత్రం అట్లాగే కొనసాగుతోంది. మొన్నటి వరకూ బండి గ్రూపు వర్సెస్ ఈటల గ్రూపు అన్నట్టు ఉండగా.. నేడు అది కాస్తా ఈటల వర్సెస్ కిషన్‌రెడ్డిగా మారింది. పార్టీలోకి ఒకరు రండి బాబూ.. రండి అని ఆహ్వానిస్తుండగా.. మరొకరు ఛల్‌రే బై ఛల్ అని అడ్డుపుల్ల వేస్తున్నారు. ఎన్నికల వేళ చేరికలకు అన్ని పార్టీలు మొగ్గుచూపుతుండగా బిజెపి వచ్చిన వారికి వెనక్కి తిప్పిపంపుతోంది. దీంతో ఆ పార్టీలో చేరాలనుకునే వారూ ఈ వింత పరిస్థితిని చూసి వెనకడుగు వేస్తున్నారు. కృష్ణయాదవ్, చికోటి ప్రవీణ్ చేరుతారనే వార్తలే దీనికి ప్రత్యక్ష ఉదాహరణలు. ఈ విషయంలో పార్టీ అగ్రనేతల తీరుపై క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల మాజీ మంత్రి కృష్ణయాదవ్ బిజెపిలో చేరేందుకు ఆసక్తి చూపారు. ఈటల రాజేందర్ ఆయన చేరిక కోసం చాలా కసరత్తు చేశారు. ఆయన చేరిక కూడా దాదాపు ఫైనల్ అయిపోయింది. రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు జి కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతారనే ప్రకటన కూడా వచ్చింది. ఇంతలోనే ఆయన చేరిక ఆగిపోయింది. ఆయన చేరికకు కిషన్‌రెడ్డినే అడ్డుపుల్ల వేశారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఒకవేళ కృష్ణయాదవ్ పార్టీలో చేరితే ఆయన చేతుల్లో అంబర్‌పేట నియోజకవర్గాన్ని అప్పనంగా పెట్టాలి. ఇది కిషన్‌రెడ్డికి సుతారమూ ఇష్టం లేదని వినికిడి. ఆ నియోజకవర్గం నుంచి తానుగాని, తన భార్యనుగానీ రంగంలోకి దింపాలని ఆయన భావించడమే దీనికి కారణం అని తెలుస్తోంది. తాజాగా చికోటి ప్రవీణ్‌కుమార్ బిజెపిలో చేరేందుకు అన్ని సన్నాహాలు చేసుకున్నారు. పలు పత్రికల్లో ప్రకటనలూ ఇచ్చుకున్నారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు కిషన్‌రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరబోతున్నారనే ప్రకటనా వెలువడింది. తన అనుచరగణంతో కర్మన్‌ఘాట్ నుంచి నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయానికి చేరకున్న చికోటి ప్రవీణ్‌కు వింత అనుభవం ఎదురైంది. పార్టీలో చేరేందుకు రమ్మని పిలిచిన లీడర్లు ఎవ్వరూ అందుబాటులో లేకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చేరిక కోసం ముందే డేట్లు ఫిక్స్ చేసిన సీనియర్ నేతలు ఎందుకు అందుబాటులో లేరని గుస్సా అయ్యారు. జాతీయ స్థాయి బిజెపి నేతలతో చర్చించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తానని చికోటి తెలిపారు. సీనియర్ నేతలు అందుబాటులో లేకపోవడంతో చేరికకు బ్రేక్ పడిందని బిజెపి వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డికి సన్నిహితంగా ఉండే ఓ నేత ఈ చేరికకు అడ్డుపుల్ల వేశారని ప్రచారం జరుగుతోంది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విషయంలోనూ ఇలాగే జరిగింది. ఈటల రాజేందర్ స్వయంగా ఆయన ఇంటికెళ్లి సంప్రదింపులు, బుజ్జగింపులు చేసి వచ్చారు. ఆయనా కాస్త మెత్తపడ్డారు. కానీ, ఇంతలోనే ఏం జరిగిందో ఏమోగానీ పార్టీ నుంచి సస్పెండ్ అయిన వ్యక్తి ఇంటికి ఎలా వెళ్తావు? అంటూ రాష్ట్ర, జాతీయ నాయకత్వాలు ఆయనపై గుస్సా అయ్యాయి. దీనంతటికీ కిషన్‌రెడ్డినే కారణమనే ప్రచారమూ అప్పట్లో జోరుగా సాగింది. మొత్తంగా ఇప్పుడు ఈటల వర్సెస్ కిషన్‌రెడ్డి అన్నట్టుగా పరిస్థితి తయారైందని, ఈ ఆధిపత్య పోరు ఎటువైపు దారితీస్తుందో అని పార్టీ శ్రేణులు ఆందోళనలో పడ్డాయి.

రాష్ట్ర ప్రభుత్వంలో టిఎస్‌ఆర్‌టిసి విలీనం

- బిల్లుకు గవర్నర్ ఆమోదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా రవాణా సంస్థ టిఎస్‌ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుకు గవర్నర్ తమిళిసై గురువారం ఆమోదం తెలిపారు. తాను చేసిన పది సిఫారసుల విషయంలో ప్రభుత్వ స్పందనపై సంతృప్తి చెందిన గవర్నర్ తాజాగా ఆ బిల్లును ఆమోదిస్తూ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి ఉద్యోగులకు గవర్నర్ అభినందనలు తెలిపారు.

ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ శాసన సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపారు. అయితే, గవర్నర్ కొన్ని అంశాలపై అధికారులను వివరణ అడిగారు. అంతేకాకుండా పది సిఫారసులు చేశారు. వీటిపై ప్రభుత్వ వివరణతో సంతృప్తి చెందిన తమిళిసై.. తాజాగా బిల్లుకు ఆమోదం తెలిపారు. దీంతో తెలంగాణ ఆర్టీసిలో పనిచేస్తున్న మొత్తం 43,373 మంది ఉద్యోగులు ప్రభుత్వోద్యోగులుగా మారనున్నారు.

ప్రజారవాణా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు, సేవలను ఇంకా విస్తృతపరిచేందుకు సంస్థలో పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఇటీవల మంత్రి మండలి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆర్‌టిసి కార్మికులు గతంలో సమ్మె చేసిన అంశాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ సానుకూల నిర్ణయం వెలువరించింది. దీనిపై విధివిధానాలు, నిబంధనలను రూపొందించేందుకు రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఆర్‌అండ్ బీ, రవాణాశాఖ,జిఎడి శాఖ కార్యదర్శులు, కార్మికశాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించిన బిల్లును వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టి.. తుది ఆమోదం కోసం గవర్నర్‌కు పంపింది. తాజాగా ఈ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపారు.

నేడు టెట్

- నిమిషం ఆలస్యమైతే నో ఎంట్రీ
- 4,78,055 మంది అభ్యర్థులు
- 2,052 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్ష జరగనుంది. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టెట్‌కు 4,78,055 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారికోసం రాష్ట్రవ్యాప్తంగా 2,052 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారికోసం 1,139 పరీక్షా కేంద్రాలు, పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారి కోసం 913 పరీక్షా కేంద్రాలున్నాయి. శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2 రాతపరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోనూ జరగనుంది. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు. టెట్‌లో వచ్చిన మార్కులకు ఉపాధ్యాయ నియామకాల్లో 20 శాతం వెయిటేజీ ఉన్న విషయం తెలిసిందే. అందుకే ఇందులో వచ్చే మార్కులకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ఈ పరీక్షల నిర్వహణ కోసం 2,052 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 2,052 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 22,572 మంది ఇన్విజిలేటర్లు, 10,260 మంది హాల్ సూపరింటెండెంట్లను నియమించారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాల ఏర్పాటు, అసౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా వంటి చర్యలను అధికారులు తీసుకున్నారు. బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నుతోనే ఓఎంఆర్ గడులను నింపాల్సి ఉంటుంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌ను తప్పనిసరిగా తెచ్చుకోవాలి.

రాష్ట్రంలోని గ్రామాలు దేశానికి ఆదర్శం

- కేంద్రం సహకరిస్తే మరింత వేగంగా గ్రామాల అభివృద్ధి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- రాష్ట్ర స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్-2023 అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి భారతదేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని గ్రామీణాభివృద్ధి సంస్థలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్-2023 అవార్డుల ప్రధానోత్సవానికి మంత్రి హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ పంచాయతీరాజ్ శాఖలోని చట్టాల్లో సమూల మార్పులు చేసి గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. రూ.35వేల కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి కష్టాలు వర్ణనాతీతమని తెలిపారు. కేంద్రం పూర్తిగా సహకరిస్తే గ్రామీణ ప్రాంతాలు మరింత వేగంగా అభివృద్ధి జరుగుతాయని తెలిపారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపుల్లో కేంద్రం పూర్తిగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో కూడా రాష్ట్రానికి అన్ని రంగాల్లో అవార్డు లభించడం గొప్ప విషయమని తెలిపారు. ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు పొందిన గ్రామాలకు వెంటనే రూ.పది లక్షల నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అక్టోబర్ రెండున కేంద్రం ప్రకటించే అవార్డుల్లో తెలంగాణ రాష్ట్రానికే అన్ని అవార్డులు వస్తాయని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం నేదూర్ గ్రామం రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ గ్రామంగా ఎంపికైనందున జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, గ్రామ సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి, సంబంధిత మండల ఎంపిడిఒలు, ఎంపిఒలను మంత్రి అభినందించారు. అనంతరం ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయత్ రాజ్ సంచాలకులు హన్మంతరావు, సెర్ప్ సిఇఒ గౌతమ్, ఎస్‌బిఎం డైరెక్టర్ సురేష్‌బాబు, సంబంధిత అధికారులు, గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత మండలాల ఎంపిడిఒలు, ఎంపిఒలు, డిపిఒలు, డిఆర్‌డిఒలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

- చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి : ఎండి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ అన్నారు. గురువారం హైదరాబాద్ సౌత్ జిల్లాలోని చార్మినార్ వద్ద తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, దున్నేవారికే భూమి కోసం సాగిన వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపిన ఘన చరిత్ర కమ్యూనిస్టులదని చెప్పారు. దీనికి మతరంగు పులమడానికి బిజెపి చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. 1946-51 మధ్య సాగిన వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రపంచ స్థాయి పోరాటాలలో ఒకటిగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. హిందూ భూస్వాములు ముస్లిం రజాకార్లు ఒక్కటై పేద రైతుల్ని చిత్రహింసలు పెట్టారనీ, దీంతో అన్ని కులాలు, మతాల ప్రజలను సాయుధులుగా తీర్చిదిద్ది కమ్యూనిస్టులు పోరాటాన్ని నిర్వహించారని చెప్పారు. ఈ పోరాటం వల్ల పది లక్షల ఎకరాల భూములు పేదలు స్వాధీనం చేసుకున్నారన్నారు. సుదీర్ఘ పోరాటంలో నాలుగు వేల మంది ప్రాణాలు త్యాగం చేశారని చెప్పారు. 10వేల గ్రామాలు విముక్తి అయ్యాయని తెలిపారు. ఆనాటి పోరాట ఘటనలకు, బిజెపి, ఎంఐఎం పార్టీలు మతం రంగు వేయాలని చూస్తున్నాయని గుర్తుచేశారు. పాత బస్తీలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం, వారికి మౌలిక వసతులు కల్పించడంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి సిపిఎం శక్తి మేరకు పోరాడుతున్నదని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం మీన, జి విఠల్, పి .నాగేశ్వర్, అబ్దుల్ సత్తార్, ఎం లక్ష్మమ్మ, శ్రావణ్‌కుమార్, ఎం బాలునాయక్, ఎ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యాశాఖలో ఎస్ఎస్ఎలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకూ కనీస వేతన స్కేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఎస్ఎలో వివిధ హోదాల్లో 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న 22 వేలకుపైగా కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. వారు రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికై ఉద్యోగ భద్రతకు అర్హత కలిగి ఉన్నారన్నారు. వారిలో అత్యధిక మంది దళిత, గిరిజన, బలహీన తరగతుల, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో కాంట్రాక్ట్ లెక్చరర్స్, రెవెన్యూ తదితర శాఖల్లోని ఉద్యోగుల్లో కొందరిని రెగ్యులరైజ్ చేసినప్పటికీ ఎస్ఎస్ఎ కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించకపోవడం వివక్ష చూపడమేనన్నారు. ఎస్-ఎస్ఎలో పనిచేసే ప్రతి కాంట్రాక్టు ఉద్యోగికి జీవిత బీమా రూ.పది లక్షలు, ఆరోగ్య బీమా రూ.ఐదు లక్షల సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యాశాఖ నియామకాల్లో 30 శాతం వెయిటేజ్ కల్పించాలని విన్నవించారు.

ఓట్ల నమోదులో ప్రయాస

- దొంగ ఓట్ల నమోదులో 'అధికారం'
- సవరణకు సహకరించని అధికారులు
- యువకుల ఓట్ల నమోదులో నిర్లక్ష్యం
- చెత్త బుట్టలో ఫామ్-6 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు చాలా కీలకం. అలాంటి ఓటు హక్కును పొందేందుకు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలగాను 18 ఏళ్లు నిండిన యువకులతోపాటు కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి, జాబితాలో తప్పులు, చేర్పులు, మార్పులు సవరణ చేసుకునేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి విశేష స్పందన వచ్చినప్పటికీ చాలా చోట్ల అధికారుల తీరు వల్ల కొత్తగా ఓట్లు నమోదు కావడం లేదు. అధికార పార్టీ నాయకులు ఇచ్చిన దరఖాస్తులను మాత్రమే నమోదు చేస్తున్నారు. ఇతరులు, సామాన్య ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను నిరాకరిస్తున్నారు. ఏదో ఒక సాకు చెప్పి వెనక్కి పంపిస్తున్నారు. వివాహం చేసుకున్న వారి ఓట్లు ఆయా నియోజకవర్గాల్లో నమోదు కావడం లేదు. కానీ అధికార పార్టీ నాయకులు సొంతంగా ఆన్‌లైన్ చేయించిన దరఖాస్తులకు మాత్రం ఎలాంటి విచారణా చేపట్టకుండానే ఆమోదం తెలుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఓటు సవరణ పై అధికారుల నిర్లక్ష్యం

ఫారం 8 ద్వారా ఓటరు జాబితాలో సవరణ చేసుకోవాలి. పేర్లు, ఇంటి నెంబర్లు, ఫొటోలు, ఇతర వివరాలు మార్చుకునేందుకు అవకాశం ఉంది. అయితే, సవరణ కోసం చేసుకున్న దరఖాస్తులను అధికారులు పరిగణలోకి తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే బిఎల్ఒలు (పోలింగ్ బూత్‌స్థాయి అధికారులు) దరఖాస్తులు పరిశీలించకుండా సవరణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా చనిపోయిన వారి ఓట్లు, వివాహం చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించడం బదిలీ చేయడానికి ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దానికిగాను ఫామ్ నెంబర్ 7 ఇవ్వాలని సూచించింది. వాస్తవానికి ఆయా పోలింగ్ పరిధిలో

విధులు నిర్వహించే బిఎల్ఒల వద్ద ఆ పోలింగ్ కేంద్రం పరిధిలోని చనిపోయిన వారి వివరాలు స్పష్టంగా ఉంటాయి. బిఎల్ఒలు అంగన్వాడీ ఉద్యోగులు కావడం వల్ల మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయడంలో అంగన్వాడీ టీచర్లే కీలకంగా వ్యవహరిస్తారు. కానీ ఓటర్ జాబితాలో చనిపోయిన వారి ఓటు తొలగించాలంటే కుటుంబ సభ్యుల ద్వారా ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని అధికారులు నిబంధన పెట్టడంతో ముందుకు పడటం లేదు. దీంతో ఓటర్ జాబితాలో చనిపోయిన వారి ఓట్లు అలాగే ఉంటున్నాయి.

ఫారం 6, 8 ను తీసుకోని అధికారులు

18 సంవత్సరాలు నిండిన యువకులు ఓటు హక్కును విధిగా నమోదు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ పిలుపునిచ్చింది. అదేవిధంగా ఆయా గ్రామాల్లోని వార్డుల్లో వలస వచ్చిన వారి ఓట్లనూ నమోదు చేసుకోవాలని సూచించింది. దీనికి ఫారం నెంబర్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. యువకుల ఓట్లకు తప్పనిసరిగా ఆధార్ కార్డుతోపాటు వయసు ధ్రువీకరించే సర్టిఫికెట్ జత చేయాలని పేర్కొన్నారు. 20 సంవత్సరాలు పైబడి ఉన్న వారి దరఖాస్తులకు ధ్రువీకరణ పత్రం లేకపోయినా సరిపోతుంది. కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండానే రిజెక్ట్ చేస్తున్నారు. ఈ నెల 2, 3 తేదీల్లో ప్రత్యేక క్యాంపుల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెల 19వ తేదీ వరకు నూతన ఓటరు దరఖాస్తు చేసుకునే గడువు ఉంది. ప్రస్తుతం బిఎల్ఒలు (అంగన్వాడీలు) సమ్మెలో ఉండటం వల్ల దరఖాస్తులు స్వీకరించడం లేదు. ఎన్నికల అధికారులూ కొత్త దరఖాస్తులు తీసుకోవడం లేదు. పలుకుబడిగల వారు ఒత్తిడి చేస్తే దరఖాస్తు తీసుకుంటున్నారు తప్ప వాటిని ఆన్‌లైన్ చేయడం లేదు. 20 సంవత్సరాలు పైబడిన వారు ఓటు కోసం ఫామ్ నెంబరు 8 ద్వారా దరఖాస్తు చేసినప్పటికీ పరిగణలోకి తీసుకోవడం లేదు. గతంలో ఎక్కడ ఉన్నారో అక్కడి ఎన్నికల అధికారి నుంచి అక్కడ ఓటు తొలగిస్తున్నట్టు ధృవీకరణ పత్రం తీసుకొస్తే తప్ప ఇక్కడ నమోదు చేసుకోబోమని తేల్చి చెప్తున్నారు. చాలామంది వీటిని భరించలేక దరఖాస్తు చేయడమే మానేస్తున్నారని సమాచారం.

ఆధార్ లింకు మరిచిన అధికారులు

దొంగ ఓట్లను తొలగించాలని ఎన్నికల కమిషన్ ఓటుకు ఆధార్ లింకు చేయాలని నిబంధన పెట్టింది. బిఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల ఆధార్ నెంబర్‌ను సేకరించి లింకు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 90 శాతం ఓట్లను ఆధార్ లింక్ చేసినట్టు సమాచారం. మిర్యాలగూడ నియోజవర్గంలో 95శాతం ఓటుకు ఆధార్ లింక్ చేశారు. మిగిలిన శాతం పూర్తి చేసి 100శాతం లక్ష్యం సాధించాలని ఉన్నత అధికారులు పదేపదే సూచిస్తున్నప్పటికీ కింది స్థాయి అధికారులు అమలు చేయడం లేదు. ఆధార్ లింకు లేనివి.. మిగిలిన ఓట్లు అన్ని దొంగ ఓట్లుగా ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. అందుకే ఆధార్ లింక్ చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ శివారు ప్రాంతాల్లో గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదు చేయించారని ఆరోపణలు ఉన్నాయి. ఆ ఓట్లకే ఇప్పుడు ఆధార్ లింక్ చేయడం లేదని ప్రతిపక్ష పార్టీలు బలంగా విమర్శిస్తున్నాయి. అంతేకాకుండా అధికార పార్టీ క్యాంపు కార్యాలయంలో అధికారుల సహకారంతో దొంగ ఓట్లను నమోదు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 27, 46,402 మంది ఓటర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 27 లక్షల 46,402 మంది ఓటర్లు ప్రస్తుతం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈనెల 19వ తేదీ వరకు ఓటుకు నమోదుకు గడువు ఉండటం వల్ల కొత్త ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరగనుంది. ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటివరకు 58,584 కొత్త ఓట్లు నమోదయ్యాయి. గతంలో పురుషులు 13 లక్షల 38,169 మంది ఉండగా ప్రస్తుతం 13 లక్షల 67,735 మందికి పెరిగారు. మహిళలు గతంలో 13 లక్షల 49,568 మంది ఉండగా 13 లక్షల 78,452 మందికి పెరిగారు. థర్డ్ జెండర్ గతంలో 81 ఉండగా 155కు పెరిగారు.

మిర్యాలగూడలో 16,012 దరఖాస్తులు

మిర్యాలగూడ నియోజవర్గంలో జులై నుంచి ఇప్పటివరకు 16,012 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నూతన ఓట్లు నమోదు చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, ఓట్ల సవరణ దరఖాస్తులున్నాయి. 3,550 దరఖాస్తులు ఆఫ్‌లైన్ ద్వారా, 12,455 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయి. ఇందులో 6851 దరఖాస్తులను అప్రూవల్ చేశారు. మిగిలిన దరఖాస్తులను ప్రస్తుతం విచారిస్తున్నారు. దరఖాస్తుల నమోదుకు ఈనెల 19 వరకు గడువు ఉంది. అక్టోబర్ 4న తుది ఓటర్ జాబితా విడుదల కానుంది.

పారదర్శకంగా నిర్వహిస్తున్నాం

ఓటు నమోదు, సవరణ, తొలగింపు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. వచ్చిన దరఖాస్తులను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతున్నాం. కొత్త ఓట్లు వెంటనే ఆన్‌లైన్ చేసి అప్రూవల్ చేస్తున్నాం. ఓట్ల సవరణ కూడా వెంటనే చేపడుతున్నాం. చనిపోయిన వారి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను పరిశీలించి తొలగిస్తున్నాం. ఈ నెల 19 వరకు కొత్త ఓట్ల కోసం నమోదు చేసుకోవచ్చు. అక్టోబర్ 4న తుది ఓట జాబితా విడుదల చేస్తాం.

ఆర్‌డిఒ చెన్నయ్య

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెతో..
మధ్యాహ్నం ఇంటి భోజనమే

- 1.5 కి.మీ నడిచి హాస్టల్‌కు..
- మీడియా రాకుండా ఆంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని, మెస్ చార్జీలు పెంచాలని తమ డిమాండ్ల కోసం మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమ్మెకు వెళ్లగా, విద్యార్థులు ఇంటి నుంచే మధ్యాహ్నం భోజనం తీసుకెళ్లి భోజనం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో ఉండటంతో విద్యార్థులు ఇంటినుంచే భోజనం తెచ్చుకొని తింటున్నారు. సమ్మెను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో విద్యార్థుల భోజన దృశ్యాలను తీయకుండా ప్రభుత్వం.. ప్రధానోపాధ్యాయులకు సూచించినట్టు రామారెడ్డి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజులు తెలిపారు. కాగా, మండలకేంద్రంలోని షెడ్యూల్ కులాల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులు ఇదే పాఠశాలలో చదువుతున్నారు. కాగా, వసతి గృహము నుంచి పాఠశాలకు దాదాపు 1.5 కిలోమీటర్ దూరం ఉండటం, మధ్యాహ్నం ఒక గంట లోపల నడుచుకుంటూ వెళ్లి, భోజనం చేసి మళ్లీ తిరిగి రావాలంటే ఇబ్బందిగా ఉందని, సమయం సరిపోవటం లేదని విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వసతి గృహం విద్యార్థులకు భోజనం పాఠశాలలోనే అందించాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే మీడియాను దూరం ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భోజనం చేస్తున్న విద్యార్థులు

రాజకీయ కక్షతోనే
చంద్రబాబు అరెస్ట్ : బిజెపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడ్ని రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ అన్నారు. గురువారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సిఎంను ఆదరాబాదరాగా అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది..? జి-20 సమావేశాల సమయంలోనే అరెస్టు చేయడానికి పోలీసులకు సమయం కుదిరిందా అని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టుతో ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో ఆయనకు మైలేజ్ వచ్చిందని తెలిపారు. తప్పును తప్పు అని చెబితే చంద్రబాబు ఏజెంట్ అని ముద్ర వేసే దురలవాటు వైసిపి నేతలకు ఉందని బండి సంజయ్ విమర్శించారు.

చంద్రబాబును అరెస్టు చేసిన విధానం సరికాదు : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

చంద్రబాబును అరెస్టు చేసిన విధానం సరైంది కాదని కేంద్ర మంత్రి, తెలంగాణ బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేసే విధానం అది కాదని.. ఒకవేళ ఏవైనా ఆరోపణలు ఉంటే నోటీసులు ఇచ్చి పిలిచి ప్రశ్నించాలని చెప్పారు. ఆ తర్వాత అరెస్టు నిర్ణయం తీసుకోవాలని వెల్లడించారు. ఢిల్లీ ఉపముఖ్యమంత్రి అరెస్టులోనూ దర్యాప్తు సంస్థలు అదే విధంగా వ్యవహరించాయన్నారు. ఎక్కడైనా సరే రాజకీయ కక్షలు ఉండొద్దని కిషన్ రెడ్డి హితవు పలికారు.

భూస్వాములను రక్షించేందుకే భారత సైన్యాలు

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాగీర్దార్లు, జమీందార్లు, దొరలు, పటేల్, పట్వారీలు తదితర భూస్వాములకు అండగా నిలబడేందుకు భారత సైన్యాలు హైదరాబాద్ సంస్థానంలోకి వచ్చాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ స్పష్టం చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో "తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నదేవరు"? అనే అంశంపై ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అధ్యక్షతన గురువారం వెబినార్ జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. నైజాం సంస్థానం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చిన తర్వాత కూడా నిజాం నవాబునే గద్దెపై కూర్చోపెట్టారన్నారు. కేంద్ర బలగాలు నిజాం నవాబును గద్దె దించడానికి రాలేదని స్పష్టం అవుతున్నదని తెలిపారు. ఏ నాగరిక దేశం కూడా తన పౌరులపైకి సైన్యాలను పంపదన్నారు. భారత ప్రభుత్వం మాత్రం తెలంగాణ సంస్థానంలోని భూస్వాములకు అండగా నిలబడేందుకు సైన్యాన్ని గ్రామాల్లోకి పంపించిందని చెప్పారు. రూమీటోపీ, షేర్వాణీలతో పట్టణంలో ఉన్న దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారీలు తెల్ల బట్టల ధరించి, నెత్తిపై ఖద్దరు టోపీ పెట్టి మిల్ట్రీ సహకారంతో గ్రామాలోకి వచ్చారన్నారు. ఆ తర్వాత బీభత్సకాండ ప్రారంభించారని చెప్పారు. భూస్వాములు మిలిటరీ, పోలీసుల సహకారంతో అత్యంత పాశవికంగా ప్రజలపై దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విలీనానికి ముందు ఆ తర్వాత మతోన్మాదం, భూస్వాములు ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని పెంచారన్నారు. నాటి పోరాటంతో ఎలాంటి సంబంధంలేని మతోన్మాదులు ఆ చారిత్రక పోరాటానికి మత రంగు పులమాలని కుయుక్తులు పన్నుతున్నదని చెప్పారు.

రాష్ట్రంలో డ్రగ్స్ కల్చర్

- బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డ్రగ్స్ కల్చర్ పెరుగుతోందని, దాన్ని అరికట్టడంలో సిఎం కెసిఆర్ పూర్తిగా విఫలమయ్యారని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. గురువారం ముస్లీం యునైటెడ్ ఫెడరేషన్ (ఎంయూఎఫ్) అధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో డ్రగ్, మర్డర్ కల్చర్‌తోపాటు అధిక వడ్డీ వసూళ్లకు వ్యతిరేకంగా నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో మత్తు పదార్థాల సరఫరా వ్యాపారం రూ కోట్లల్లో జరుగుతోందన్నారు. దీన్ని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సెలబ్రేటీలు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపి రేవంత్ రెడ్డి ఐటీ మంత్రి కెటిఆర్‌పై డ్రగ్స్ తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ, మత్తు పదార్థాలను కంట్రోల్ చేయడంలో లేదని ఆరోపించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

మహిళా లోకాన్ని చైతన్య పరచండి

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మహిళా లోకాన్ని చైతన్య పరచండి. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే సమాజం బాగుపడుతుంది. మహిళల్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా సిఎం కెసిఆర్ పని చేస్తున్నారు. ఆయనకు అండగా నిలవండి' అని జిల్లా మహిళా సమాఖ్యల పదాధికారులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని టిఎస్ఐఆర్‌డిలో జిల్లాల మహిళా సమాఖ్యల పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వచ్చాకే రాష్ట్రంలో మహిళా సంఘాలు బలోపేతమయ్యాయనీ, మన మహిళలు దేశంలోనే ముందంజలో ఉన్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటింటికీ నల్లాల ద్వారా తాగు నీరు అందిస్తున్న ఘనత మన రాష్ట్రానిదేనన్నారు. బహిరంగ మల విసర్జన రహిత రాష్ట్రంగా నిలవడం గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హనుమంతరావు, సెర్ప్ సిఇఒ గౌతం, స్పెషల్ కమిషనర్ ప్రదీప్, ఎస్‌బిఎం డైరెక్టర్ సురేష్, డిప్యూటీ కమిషనర్లు రామారావు, రవీందర్, వివిధ జిల్లాల సమాఖ్యల పదాధికార మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నాడు మాట ఇచ్చాం...
నేడు నిలబెట్టుకుంటున్నాం

- పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలతో జిల్లా సస్యశ్యామలం : మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మిస్తామంటూ 'నాడు మాట ఇచ్చాం...నేడు నిలబెట్టుకున్నాం' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. జూరాల బ్యాక్ వాటర్ నుంచి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల అనే వాదన హాస్యాస్పదమని ఒక ప్రకటనలో తెలిపారు. జూరాల రిజర్వాయర్ సామర్థ్యం 9 టిఎంసిలు, అందుబాటులో ఉండేది 6 టిఎంసిలేనని పేర్కొన్నారు. ఆ నీటిని ఎత్తిపోయడం సాధ్యమయ్యేపనేనా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమాన్ని పక్కదారి పట్టించడం, పాలమూరు ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా నాటి సిఎం కిరణ్ కుమార్ రెడ్డి హడావిడిగా దాన్ని ప్రకటించారని గుర్తు చేశారు. సిఎం కెసిఆర్ ముందుచూపుతో 263 టిఎంసిల సామర్థ్యం గల శ్రీశైలం బ్యాక్ వాటర్ ప్రాంతం నుంచి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు నీళ్లు తీసుకుంటున్నారని వివరించారు. దశాబ్దాలపాటు జూరాలను నిర్మించిన వారు భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు ఎత్తిపోతలను సాగదీసి పాలమూరును ఎండబెట్టి ప్రజలను వలసలపాలు చేసిన వారికి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం గురించి మాట్లాడే హక్కు లేదని విమర్శించారు. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే ఆ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించినట్టు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పాలమూరు రంగారెడ్డి అందుబాటులోకి వస్తోందని చెప్పారు. ప్రాజెక్టు పూర్తికాకుండా కేసులు వేసి అడ్డుకున్న వారే ఇప్పుడు పాలమూరు రంగారెడ్డి పూర్తవుతుండడాన్ని చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పాలమూరు ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి కెసిఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. ఈనెల 16న నార్లాపూర్ పంప్ హౌస్ వెట్ రన్, కొల్లాపూర్‌లోని సిఎం బహిరంగసభకు పాలమూరు ప్రతి పల్లె నుంచి కదిలిరావాలని పిలుపునిచ్చారు.

భూస్వాములను తరిమికొట్టిన చరిత్ర ఎర్రజెండాది

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మూడు వేల గ్రామాల్లో భూస్వాములను తరిమికొట్టి సుమారు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర ఎర్రజెండాకు ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా గురువారం రంగారెడ్డి జిల్లా మన్సూరాబాద్ డివిజన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాటంలో సుమారు నాలుగు వేల మంది ప్రాణం కోల్పోయారన్నారు. అప్పట్లో భూస్వాములు అన్ని రకాల కులస్తులతో వెట్టి చాకిరీ చేయించుకున్నారన్నారు. ఈ క్రమంలో వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా.. దున్నే వాడిదే భూమి అనే నినాదంతో ఎర్రజెండా ఆధ్వర్యంలో కమ్యూనిస్టులు పోరాటం చేసి భూస్వాముల భూములను పేదలకు పంచి పెట్టారని గుర్తు చేశారు. నిజాం సర్కారులాగా.. ఈనాడు తెలంగాణ ప్రభుత్వం ఉందని, పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పథకాలు సక్రమంగా అమలు కావట్లేదన్నారు. అందరికీ విద్యా, వైద్యం అందించాలని కోరారు. తల దాచుకోవడానికి వంద చదరపు గజాల భూమి కోసం వెళ్తే కేసులు పెట్టడం, మహిళలు అని చూడకుండా జైలుకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం హిందూత్వం పేరుతో తెలంగాణలో ఓట్లు రాబట్టేందుకు యత్నిస్తోందన్నారు. మనకు రావాల్సిన హక్కుల కోసం పోరాటం చేయాలని, మన కోసం మన వాడికి ఓటు వేసుకోవాలని అప్పుడే రాజ్యాంగం పరిపాలన చేస్తామని చెప్పారు. కేంద్రం ఇష్టానుసారంగా ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో సిపిఎం చేపట్టే పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఓటును నోట్ల కోసం, మందు, బీరు, బిర్యానీ కోసం అమ్ముకోవద్దని సూచించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రమోహన్, పగడాల యాదయ్య, నాయకులు ఏర్పుల నర్సింహ, హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి, సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి వెంకన్న, ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఎల్లయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

తెలంగాణపై అధిష్టానం గంపెడాశలు

- అధికారం సాధించేందుకు ఇక్కడే తిష్ట
- ప్రతి సమావేశంలోనూ పాల్గొని దిశానిర్దేశం
- క్షేత్రస్థాయి పర్యవేక్షణలోనూ కీలకం
- ఎప్పటికప్పుడు ఏఐసిసికి నివేదికలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంపై కాంగ్రెస్ అధిష్టానం గంపెడాశలు పెట్టుకుంది. కర్ణాటక తర్వాత తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు పట్టుదలతో ఉంది. గతంలోలాగా అంతా రాష్ట్ర నాయకత్వంపై వదిలేయకుండా అన్నీ తానై వ్యవహరిస్తోంది. ఎన్నికల సమయంలో టిపిసిసికి పూర్తి పగ్గాలు అప్పగించకుండా అధిష్టానం రాష్ట్రంలో తిష్ట వేసింది. దాని ప్రభావం రాబోయే ఎన్నికల్లో ఉంటుందని అధిష్టానం భావిస్తున్నది. అధిష్టానం ఒకవైపు పర్యవేక్షిస్తూనే... మరోవైపు ఎంపి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించింది. కొద్ది రోజుల్లో బిసిలకూ కీలక పదవి రాబోతున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల ప్రక్రియ అధిష్టానం కన్నుసన్నల్లోనే కొనసాగుతుంది. తెలంగాణ రాష్ట్రానికి గత రెండు నెలల్లో అధిష్టానం దూతలు 30 మంది గాంధీభవన్‌కు వచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసిసి కార్యదర్శులు రోహిత్ చౌదరి, మన్సూర్‌అలీ ఖాన్, పి విశ్వనాథ్... ఇక్కడే మకాం వేశారు. గాంధీభవన్ నుంచి ఠాక్రే పర్యవేక్షణ చేస్తుండగా, మిగతా ముగ్గురు మాత్రం ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఆయా జిల్లాల్లో నిర్మాణం, పార్టీ బలోపేతం, అంతర్గత విభేదాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. పార్టీ దృష్టికి వస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధిష్టానానికి నివేదిస్తున్నారు. రాష్ట్రంలోని 17పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఒక్కొక్క ఇంచార్జిని అధిష్టానం నియమించింది. వారందరికీ దీపదాస్ మున్షీ ఇంచార్జిగా, కో కన్వీనర్‌గా మీనాక్షి నటరాజన్‌ను అధిష్టానం నియమించింది. ఎక్కడా ఏ సమస్య వచ్చినా స్థానిక నేతలతో సమన్వయం చేసుకుంటూ దాన్ని పరిష్కరిస్తున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి.

దూకుడు...దూకుడే

ఎన్నికల సమయం ముంచుకొస్తున్న కొద్దీ కాంగ్రెస్ మరింత దూకుడు పెంచుతోంది. ప్రజల్లోకి మరింతగా చొచ్చుకుపోయేందుకు కార్యాచరణ రూపొందించింది. అన్ని కార్యక్రమాలను కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోంది. కర్ణాటక ఎన్నికల తరహాలోనే టిపిసిసికి మార్గదర్శకత్వం చేసేందుకు అధిష్టానం ఇక్కడే తిష్ట వేసింది. ప్రతి సమావేశంలోనూ పాల్గొని దిశా నిర్దేశం చేస్తున్నారు. వారు క్షేత్రస్థాయి పర్యవేక్షణలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దుతున్నారు. అభిప్రాయబేధాలు బహిర్గతం కాకుండా కట్టుదిట్టం చేస్తున్నారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలపై నిఘా పెట్టింది. పార్టీ కోవర్టులను సైతం తోవకు తెచ్చినట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. పార్టీని అంతర్గతంగా బలోపేతం చేస్తూనే... క్రియాశీలక నాయకులను గుర్తించి వారిని అనేక కమిటీల్లో నియమిస్తున్నది. అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఎవరికైతే టికెట్‌రాదో వారిని బుజ్జగిస్తున్నారు. ఏఐసిసి స్థాయిలో పదవి రాలేదంటూ ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అలిగారు. అలకబూనారు. వెంటనే ఠాక్రే రంగంలోకి దిగి, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌తో మాట్లాడించి ఆయన్ను శాంతింపజేశారు. నాయకుల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ... అక్కడిక్కడే సర్దుబాటు చేస్తున్నారు.

17న ఎన్నికల శంఖారావం

మరోవైపు సిడబ్ల్యుసి సమావేశాలను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్... దాన్ని ఎన్నికల ప్రచారాస్త్రంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నెల 17న నిర్వహించబోయే విజయభేరి సభను విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయి నుంచి సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో ప్రతి అంశాన్ని పార్టీకి ఊపు తెచ్చేలా ప్రయత్నిస్తున్నారు. సభకు భారీ జనసమీకరణ చేపట్టడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి ఇక తిరుగులేదనే సంకేతాలు ఇచ్చేందుకు అధిష్టానం ప్రయత్నిస్తోంది. మరోవైపు మ్యానిఫెస్టో కమిటీ, కమ్యూనికేషన్ కమిటీ, శిక్షణ తరగతుల కమిటీ, బిసి డిక్లరేషన్ కమిటీ...ఇలా రకరకాల కమిటీ సమావేశాలతో గాంధీభవన్ బిజీబిజీగా మారింది. మ్యానిఫెస్టో కమిటీ కీలకంగా మారబోతోంది. విజయభేరి సభలో సోనియాగాంధీ ఇచ్చే ఐదు హామీలపై సుదీర్ఘ మంతనాలు జరుపుతున్నారు. అందులో మహిళా, రైతు, యువత, సంక్షేమం (ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ), అసైన్డ్ భూములపై కీలక హామీలుగా ఉండే అవకాశం ఉందని సమాచారం. కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటికే అమలు చేస్తున్న కాంగ్రెస్... ఇక్కడ కూడా అదే మాదిరిగా హామీలిచ్చి అమలయ్యేలా రాహుల్‌గాంధీ భరోసా కల్పించనున్నారు. పార్టీ ఎంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నప్పటికీ అభ్యర్థుల ఎంపికలోనూ అధిష్టానం అచీతుచీ వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. కర్ణాటకలో ఓ నియోజకవర్గం నుంచి సిద్దారామయ్య గెలిచే అవకాశం లేదంటూ అధిష్టానం ఆయన్ను వేరే నియోజకవర్గానికి మార్చింది. తెలంగాణ రాష్ట్రంలో అధిష్టానం చేపట్టిన సర్వేల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేసే సూచనలు కనిపిస్తున్నాయి. సర్వేల్లో ఫలనా నేత అక్కడ ఓడిపోతారనే సంకేతాలు ఉంటే, ఆయన స్థానంలో మరో అభ్యర్థిని ఖరారు చేసేలా అధిష్టానం ప్లాన్ బీ రెడీ చేసింది.



ఎయిర్‌పోర్టులో 1,218 గ్రాముల బంగారం పట్టివేత

- ఇద్దరు ప్రయాణికుల అరెస్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశాల నుంచి అక్రమంగా తరలిస్తున్న 1,218 గ్రాముల బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకున్నారు. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌలాలంపూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఒక ప్రయాణికుడిని అనుమానంతో అధికారులు తనిఖీ చేయగా.. రూ.38.62 లక్షల విలువైన 636 గ్రాముల బంగారం లభించింది. నిందితుడు ఫ్యాన్‌లో దాచుకొని బంగారాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. మరో ఘటనలో రియాద్ నుంచి వస్తున్న మరో ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఐదు బంగారు బిస్కెట్లను ప్యాంట్‌లో దాచుకొని వస్తుండగా పట్టుకున్నారు. 582 గ్రాముల బంగారం.. దాని విలువ సుమారు రూ.35.35లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితుల్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

28 నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మె

- విద్యాశాఖకు సమ్మె నోటీసు ఇచ్చిన సిఐటియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 28 నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఉన్నతాధికారులకు సమ్మె నోటీసును తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమ, రాష్ట్ర కమిటీ సభ్యులు వై సోమన్న అందజేశారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాల చెల్లింపునకు బడ్జెట్ విడుదల చేయాలనీ, కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించి పాత బిల్లులను విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతను ఎన్‌జిఒ సంస్థలకు అప్పగించడాన్ని ఆపేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెలోకి వెళ్లబోతున్నట్టు ఈ సందర్భంగా వారు ప్రకటించారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని ఆపడంతో పాటు రాజకీయ వేధింపులకు అడ్డుకట్ట వేయాలని విన్నవించారు. వారికి వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. వంట షెడ్లు, వంట పాత్రలు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. యూనిఫామ్‌లు ఇవ్వాలని, ప్రమాదబీమా, పిఎఫ్, ఇఎస్ఐ, షరతుల్లేని బ్యాంకు రుణ సదుపాయం వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు.